క్లుప్తంగా

రేగిడి ఎస్ఐగా బాలకృష్ణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ బాలకృష్ణ

రేగిడి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వి.బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన విజయనగరం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చా రు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పి.నీలావతి విజయనగరం ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, నాటు సారా, మత్తుపదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా పెడతామని చెప్పారు.

దీపారాధన


శివలింగం ఆకారంలో వెలిగించిన దీపాలు

రేగిడి: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వన్నలి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం దీపారాధన చేశారు. మహిళలు శివలింగం, ఓంకారం, స్వస్తిక్, తదితర ఆకారాల్లో దీపాలను వెలిగించారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సంతకవిటి: సిరిపురం గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న బాలాజీ ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా దుకాణం నిర్వహిస్తున్నట్లు ధ్రువీకరించి దుకాణంలోని రూ.31,553 విలువ చేసే ఎరువులు, రూ.79,669 విలువ చేసే పురుగు మందులను సీజ్ చేశామని ఏఓ యశ్వంత్‌రావు తెలిపారు. తనిఖీల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ఎర్రంనాయుడు, ఎస్ఐ బి.రామారావు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


శివ్వాంలో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: వరి పంటను ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఓ తట్టికోట కన్నబాబు రైతులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు శివ్వాం గ్రామంలో శుక్రవారం పర్య టించి వరి పంటను పరిశీలించారు. పంటను ఆకు ముడత తెగులు, కాండం తొలచు పురుగు ఆశిస్తే కార్టప్ హైడ్రో క్లోరైడ్ మందును రెండు గ్రాములను లీటరు నీటికి కలిపి ఎకరానికి రెండు వందల లీటర్ల ద్రావణం పిచికారీ చేయాలని చెప్పారు. పాముపొడతెగులు ఆశిస్తే హెక్సాకొనజోల్ లేదా వాలిడామైసిన్ మందును లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణం పిచికారీ చేయాలని వివరించారు.

చంద్రశేఖర్‌కు ఫిజిక్స్‌లో డాక్టరేట్


డాక్టరేట్ పొందిన చంద్రశేఖర్

రాజాం: పట్టణంలో మారుతీనగర్‌కు చెందిన బెజ్జిపురపు చంద్రశేఖర్‌కు ఫిజిక్స్ విభాగంలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ పట్టా లభించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి చంద్రశేఖర్ ఈ పట్టా అందుకున్నారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఈయన గత ఏడేళ్లుగా ఫిజికల్ సైన్స్‌లో పరిశోధనలు చేశారు. ఆప్టో ఎలక్ట్రానిక్ వినియోగాల కోసం టీఐఫోర్‌ప్లస్, సీఓటుప్లస్, ఎంఎన్‌టుప్లస్ డోప్ చేసిన జెడ్ఎన్ఓ–బీఐటుఓత్రి– బీటుఓత్రి గ్లాసుల స్పెక్ట్రోస్కోపిక్, లక్షణాల పరిశీలన అనే అంశంపై పరిశోధన నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే పలు విదేశీ జర్నల్స్‌లో నాగార్జున యూనివర్సిటీ అధికారికంగా తనకు పీహెచ్‌డీ ప్రకటించిందని వెల్లడించారు. ఇటీవల ఆ పట్టాను తనకు ప్రధానం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షణ్ముఖరావుతో పాటు పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు,ఆయనకు అభినందనలు తెలిపారు.

జ్ఞాన ప్రబోధకుడు గురువే..

- ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


వంగర: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

బొబ్బిలి: గురువే జ్ఞాన ప్రబోధకుడని, అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగు ప్రసాదించే గురువులను గౌరవించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఉపాధ్యాయుడిగా, భారతదేశ రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించా రు. పలు సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని వేర్వేరు వేదికలపై నిర్వహించిన కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

బాడంగి కేజీబీవీలో...

బాడంగి: స్థానిక కేజీబీవీలో ఎస్ఓ జి.హరిత ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయినులు పూలమాలలు వేసి వాళులర్పించారు. పాఠశాలలో ఇంగ్లిష్ సీఆర్‌టీగా పనిచేస్తున్న అనితకుమారికి జిల్లా ఉత్త మ సీఆర్‌టీగా అవార్డురావడంతో ఆమెకు ఉపాధ్యాయినులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాలలో పని చేస్తున్న సీఆర్‌టీలను సత్కరించారు.

విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

బొబ్బిలిరూరల్: విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని డీఎస్పీ జి.భవ్యారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మెట్టవలస సమీపంలో ని ఏషియన్ ఎయిడ్ స్కూల్‌ఫర్ బ్లైండ్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆమె అతిథిగా హాజరయ్యారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజాన్ని తీర్చిదిద్దడం ఉన్నత విలువలతో జీవించేలా, క్రమశిక్షణతో విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చేయడం ఒక్క ఉపాధ్యాయ వృత్తికే దక్కిందని కొనియాడారు.ప్రిన్సిపాల్ జి.శాంతాలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సర్వేపల్లి

రేగిడి: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ ఆదర్శప్రాయుడని లింగాలవలస ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.పీడీ సన్యాసిరావు, ఉపాధ్యాయు లు టి.రవికుమార్, ఈశ్వరరావు, శ్రీనివాసాచారి, ఏ.తవిటిరాజు, పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

వంగర: మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మండలం లోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి న ఉపాధ్యాయులు బెవర కామేశ్వరరావు, కె.సూరపునాయుడు, బి.వెంకటరావు, పి.భాస్కరరావు, కె.భుజంగరావు, పి.మొయ్యిన్నాయుడు, టి.మన్మథరావు, జి.తవిటయ్య, బి.అప్పలరాజు ను సన్మానించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బలగ ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ ఆధ్వర్యంలో..

రాజాం సిటీ: పట్టణంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి మానవతా సంస్థ ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

పెంట అంగన్‌వాడీ కేంద్రంలో..

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి చిన్నారులతో పూలమాలలు వేయించి, నివాళులర్పించారు. చిన్నారులు సాంప్రదాయ వేషధారణలతో హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, రామలక్ష్మి, ఉమ, ఆయాలు పాల్గొన్నారు.

నాయుడువలసలో..

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు జె.సి.రాజును గ్రామపెద్దలు, యువత సన్మానించారు.


బాడంగి: బాడంగి కేజీబీవీలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినులు


రేగిడి: లింగాలవలస ఉన్నత పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


బొబ్బిలి: పట్టణంలో వనమిత్ర అధ్యక్షుడు కష్ణదాస్ మాస్టార్‌నుసత్కరిస్తున్న అన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు



బొబ్బిలిరూరల్: మెట్టవలసలోని ఏషియన్ ఎయిడ్ స్కూల్ ఫర్ బ్లైండ్ స్కూల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి


రాజాం సిటీ: పట్టణంలో సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు


బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ జవహర్ పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు



బొబ్బిలి: పట్టణంలో ఉపాధ్యాయుడు జె.సి.రాజును సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ రాజేశ్వరి,ఎస్‌టీఓ పి.వి. పద్మనాభం.తదితరులు


రామభద్రపురం : నాయుడువలసలో ఉపాధ్యాయుడు రాజును సత్కరిస్తున్న గ్రామయువత, ప్రజలు


బొబ్బిలిరూరల్: పెంట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

శివారు ప్రాంతాలకు సాగునీరు అందించండి


డాక్టర్ తలే రాజేష్

రాజాం: మడ్డువలస సాగునీటి కుడికాలువ ఆయకట్టులో శివారు పంటపొలాలకు సాగునీరు అందడంలేదని రాజాం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. రాజాంలోని పార్టీ కార్యాల యంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంతకవిటి, రేగిడి మండలాల్లో మడ్డువలస థైలాండ్ వరి పొలాలు సాగునీరు లేక ఎండిపోతున్నాయని అన్నారు. సంతకవిటి మండలంలో మండాకురిటి నుంచి దిగువ ప్రాంతాలకు నీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి రైతులు ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేస్తే ఎవరూ స్పందించడంలేదని తమకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇలానే రైతులకు సాగునీటి కష్టాలు తెచ్చిపెడితే వ్యవసాయం చేసేదెలా అని ప్రశ్నించారు. రైతులకు ఖరీఫ్‌లో అందుబాటులో ఉండాల్సిన మడ్డువలస కాలువల అధికారులు ఇలా నిర్లక్ష్యం వహించడం తగదని మండిపడ్డారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మడ్డువలస శివారు ప్రాంతాలకు సాగునీటిని అందించాలని కోరారు.

నేత్రదానానికి అంగీకారం

రాజాం సిటీ: నేత్రదానం ఆవశ్యకత తెలుసుకున్న వికాసతరంగిణి రాజాం శాఖకు చెందిన 20 మంది సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు.నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ ఆధ్వ ర్యంలో స్థానిక బొబ్బిలి రోడ్డులోని దేవిశ్రీదేవి కల్యాణ మండపంలో వికాసతరంగిణి యోగా సాధకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్యకుమార్ మాట్లా డుతూ మరణానంతరం ఒకరు నేత్రదానం చేయడం వల్ల ఇద్దరి అంధులకు కంటి చూపు వస్తుం దని చెప్పారు. నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ పత్రాలు అందించిన వికాస తరంగిణి సభ్యులను అభినందించారు. వికాసతరంగిణి అధ్యక్షుడు గడే అప్పలనాయుడు, సభ్యులు పల్లా నారాయణరావు, పల్లా వెంకటమధుసూదనరావు, బలగ ప్రసాదరావు, సందీప్, గంటా వెంకట నాయుడు, రెడ్డి శంకరరావు, కర్రి కన్నబాబు, సర్వేశ్వరరావు, పి.శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.


నేత్రదానానికి అంగీకారం తెలుపుతూ పత్రాలు చూపుతున్న వికాసతరంగిణి సభ్యులు

9న నవదుర్గ ఆలయ హుండీ కానుకల లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీ కానుకలను ఈనెల 9న లెక్కించనున్నామని ఈఓ పి.శ్యామలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్త వి.నర్సింగరావు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని సహాయసహకారాలు అందించాలని కోరారు.

ఆలయ కమిటీ నియామకం

బొబ్బిలి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఆలయానికి దేవదాయ శాఖ అధికారులు కమిటీని నియ మించారు. కింతలి బంగార్రాజుతో పాటు పలువురు డైరెక్టర్లతో దేవదాయ శాఖాధికారులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే బేబీ నాయన,బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, గిరడ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ఆలయానికి దేవదాయ శాఖ అధికారులు కమిటీని నియమించారు. చైర్మన్‌గా కింతలి బంగార్రాజుతో పాటు డైరెక్టర్లుగా చిలకలపల్లి శ్రీనివాసరావు, తదితరులతో దేవదాయ శాఖాధికారులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే బేబీ నాయన,బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, గిరడ అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండల ప్రజాప్రతి నిధులు,అధికారులు హాజరు కావాలని కోరారు.

8న బాడంగి మండల సమావేశం

బాడంగి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల8వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


తెర్లాం: కలెక్టర్ అంబేడ్కర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్ఎం వెంకట సంగమేశ్వరరావు


బొబ్బిలిరూరల్: హెచ్ఎం జోగారావును సత్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

తెర్లాం: మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాకోజు వెంకట సంగమేశ్వరరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ హెచ్ఎం వెంకట సంగమేశ్వరరావును సన్మానించి, అవార్డు అందజేశారు. ఆయనకి ఎంఈఓ జె.త్రినాథరావు, తోటి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్ఎం జోగారావుకు సత్కారం

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యికొండవలస గిరిజన గ్రామ మోడల్ ప్రైమరీ స్కూల్ పీఎస్ హెచ్ఎం కె.జోగారావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన్ని జిల్లా కేంద్రంలో కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం జోగారావుకు తోటి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

వంగర: మండల కేంద్రంలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాల యం ఆవరణలో పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. మాజీ ఎంపీపీలు బొత్స వాసుదేవ రావునాయుడు, కొల్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. .తప్పెట మేళ, తాళాలు, కోలాటాలు, డీజేలతో వినాయ విగ్రహాలను ఊరేగించారు. చిన్నాపెద్దా అంతా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సంతకవిటి మండలంలోని కృష్ణంవలస, కె.ఆర్‌పురం, ఎం.ఆర్.అగ్రహారం, మండాకురిటి తదితర గ్రామాల్లో అన్నదానాలు నిర్వహించారు. కొండంపేట శ్రీరామలింగేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో స్వామి వారికి నివేదించిన లడ్డూకు వేలం వేయగా, గ్రామానికి చెందిన పలిశెట్టి హరికృష్ణ రూ.18,500లకు కైవసం చేసుకున్నారు. బాడంగి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో లడ్డూ ప్రసాదానికి వేలం వేయగా, కాలనీకి చెందిన ఈదుబిల్లి శేఖర్ రూ.6వేలకు దక్కించుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్


రామభద్రపురం: మండల కేంద్రంలో వినాయక తిరువీధి నిర్వహిస్తున్న చేపల మార్కెట్ వీధి భక్తులు


రేగిడి: వన్నలిలో గణనాథుని ఊరేగింపులో భక్తులు


సంతకవిటి: మండాకురిటిలో అన్నదానం


రామభద్రపురం: మండల కేంద్రంలోని చౌక్యాపు వీధిలో నిర్వహించిన వినాయక ఊరేగింపులో మహిళల కోలాటం


తెర్లాం: కాగాంలో నిర్వహించిన ఊరేగింపులో భక్తుల సందడి


సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు


బాడంగి: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వినాయకు నిమజ్జనంలో పాల్గొన్న యువకులు

ఘనంగా జెడ్పీ చైర్మన్ పుట్టిన రోజు


తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు


తెర్లాం: పెరుమాళి పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది


రాజాం: బొద్దాంలో పేదలకు ఆహారపొట్లాలు, పండ్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వర్షిణి, తదితరులు

తెర్లాం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. గోపాలవలస సర్పంచ్ ప్రతినిధి గొందాల వెంకటరావు ఆధ్వర్యంలో పెరుమాళి మోడల్ కళాశాల వసతి గృహం, పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు.ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లు, ఆహార పొట్లాల పంపిణీ

రాజాం: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా బొద్దాం గ్రామంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు శుక్రవారం 118 మంది పేదలకు పండ్లు, ఆహార పొట్లాలు పంపిణీ నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు,యువకులు పాల్గొన్నారు.

గజల్ వినోద్‌కు గానకోకిల అవార్డు

విజయనగరం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా, చినమరికి గ్రామానికి చెందిన ప్రముఖ అంతర్జాతీయ గజల్ గాయకుడు గజల్ వినోద్‌కు గానకోకిల నంది అవార్డు లభించింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో విరూపాక్ష గార్డెన్స్‌లో గానకోకిల కళానికేతన్ వ్యవస్థాపకుడు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ సంస్థ 33వ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులను గానకోకిల నంది అవార్డులతో సత్కరించారు. ఈ క్రమంలో వినోద్‌కు ఎమ్మెల్సీ రమణ చేతులమీదుగా పురస్కారం ప్రదానం చేశారు.


అవార్డు అందుకుంటున్న వినోద్